# రంగుజోళ్ళు

"హల్లో! ఏమిటోయ్ జానకీ ఇలా ఊడిపడ్డావ్?.... ఫర్వాలేదు. జోళ్ళు ఆ మూలగా విడువ్.... కాఫీ తెప్పించనా?... పోనీ టీ తాగుతావా?"

"....  ..."

"చల్లని మంచినీళ్ళేంఖర్మం! కావాలంటే షర్బత్తే తెప్పిస్తానుండు.... మద్రాసన్నమాటేగానీ, ఎండలు మండి పోతున్నాయి జానకీ! ఈమధ్యనే ఎక్కడో చదివాను... అతి వాస్తవిక కవిత్వంలా, ఎండలు మిటమిటలాడుతున్నాయిట. చాలా తమాషాగా ఉందిగదూ ఆ వాక్యం?..."

"....  ..."

అదేమిటోయ్ జానకీ! అలా అంటావ్ ? ఏం ? గోపాలం ఆమాత్రం రాయలేడనా? రాయడం అతనికి చాతకాదనా నీ ఉద్దేశం? అతను రాసిన కొన్నికథలు ఎంత బావుంటాయని..."

"... ...."

"అతనికథలు బావుంటాయంటే, అతన్ని వెనకేసుకొస్తున్నట్టా అర్థం? ఇందులో వెనకేసుకురావడానికీ, పోవటానికి అసలేముందిగనక! ఓ మంచిని మంచి అని చెప్పుకోవడానికి ఆ మనిషి మనకు తెలిసుండనవసరంలేదనుకొంటాను."

"... ...."

"ఆమాటనిజమే జానకీ! గోపాలంతో పరిచయం కలగకపూర్వం అతనికథలు నేనేమీ చదవలేదు. అంచేతే అప్పుడు అతనికథల్ని గురించి నేను నోరెత్తలేదు... చదవని వాటినిగురించి, అభిప్రాయాలు వెలిబుచ్చేధైర్యం నాకింకా రాలేదు."

"..... ..."

"చంపావు పో ! ఇలాంటిప్రశ్న ఒకటుందనిగూడా నాకు తట్టలేదుసుమా జానకీ! ఏమోనబ్బా, గోపాలంమీద ఇష్టంవల్ల గోపాలం నచ్చాడో,కథలమీదఇష్టంవల్లగోపాలం నచ్చాడో నేను చెప్పలేను. అయినా ఏమిటిలా యక్షప్రశ్న లేస్తున్నావీపూట?"

"... ...."

"సరిసరి. ఏదో ఓ కారణముంటుందని గుడ్డిముండ గ్గూడా తెలుసు. అదా నువ్వునాకు చెప్పేజవాబు!పోనిద్దూ దిక్కుమాలినగొడవ. ఎప్పుడూ మనకుండేదేగానీ, నిన్న సాయంత్రం సినిమాకొస్తానన్నదానివి అయిపూ ఆన మాలూ లేదేమిటోయ్?"

"..... ....

"నువ్వా వచ్చావా? అదెప్పుడు? ఏ ఆటకు ? మరి వచ్చిందానివి నాకు కనిపించలేదేం? ఎక్కడ కూచున్నా వేమిటోయ్?"

"... ...."

"మా వెనగ్గాకూచోడమెందుకు? అప్పటికీ నువ్వొస్తా నన్నావని గోపాలంతో చెప్పాను. అతనేమో నువ్వు రావం

టాడు. తప్పకుండా వస్తావని నేనంటాను. ఆట మొదలెట్టాక కొంతసేపు నేను బైటనే నిలబడ్డాను. అయితే మేం లోపలికెళ్ళాకగానీ నువ్వు రాలేదన్నమాట. వచ్చిందానివి, నా కన్పించకుండా ఎక్కడో మూలన కూచోడమేమిటోయ్?"

"జానకీ! నువ్వంటే నాకభ్యంతరమేమిటోయ్? ఓరకంగా చూస్తే నాకు గోపాలమే కొత్తవాడుగానీ,నువ్వు కాదుగదా! అసలు — అతన్ని పరిచయంచేసిందిగూడా నువ్వేనాయె. అటువంటప్పుడు గోపాలం, నాకన్నా నీకే ఎక్కువ స్నేహితుడవుతాడుగనీ...."

"......"

"ఏమిటోనోయ్! నీ మాటలన్నీ ఈ పూట అదోలా వున్నాయి. ముందొచ్చిన చెవులకంటే, వెనకొచ్చిన కొమ్ములు వాడివంటున్నావు. ఈ సామెత నువ్వెందుకన్నదీ నాకు తెలీలేదు. అనదలిచిందేమిటో స్పష్టంగా అనరాదూ? ఈ గుడుగుడుగుండం వ్యవహారం దేనికి?

"......"

"మోసమా? ఇందులో మోసమేముంది జానకీ! అతను మంచివాడనీ, గొప్పవాడనీ నువ్వే అంటివి. మోసగాడనీ, నమ్మకద్రోహనీ నువ్వే అంటుంటివి. ఇందులో దేన్ని నమ్మాలా అని. ఇంతలోకే అతన్నిగురించి, నీ అభిప్రాయం ఇంతలా మారిపోయిందేం?"

"......"

"అలా నిగ్గదీసి అడిగితే నేనేం చెప్పను జానకీ? ఇంకా నాకే ఓ స్పష్టమైన అభిప్రాయమంటూ ఏర్పడ లేదు. అతను—నాకు మంచివాడుగానే కనిపించాడు. ఈ కాలపు కుర్రకారును చూస్తుంటే, నాకెందుకో రోతకలుగు తుంది జానకీ! గోపాలాన్ని చూసినప్పుడు అది కలగలేదు. సహం—అందుకే అతనితో స్నేహంగా ఉంటున్నాను."

"... ...."

"దాన్ని నువ్వు ప్రేమను, వల్లకాడను, మరోటను. పేరులో ఏముంది జానకీ! అతనుమాత్రం నన్ను — అదే నువ్వంటున్నావే ఇప్పుడు, ప్రేమ అని — అది చేస్తున్నా నన్నాడు. నేను నవ్వి ఊరుకొన్నాను"

".... ..."

"అరె! వెనగ్గా ఉండి నువ్వుచేసినపని ఇదా ! మా మాటలు వినడానికేనా నువ్వు మావెనక చేరింది? పైగా నంగనాచిలా మాట్లాడతావేం!"

".... ..."

"అవును. అయితేగియితే, అన్నీ కుదిరితే మేం పెళ్ళాడుదామనుకొంటున్నాం. అనుకోవడమేమిటి, ఓ నిశ్చ యానిగ్గూడా వచ్చాం. ఓ శుభముహూర్తాన ..."

"... ...."

"ఈ నీతులేమీ నేను వినదలుచుకోలేదు జానకీ ! ఆలోచించడం చేతకానప్పుడు, తప్పకుండా నీ సలహా తీసు కొంటాను. అతను మోసగించాడని నీ దగ్గరకొచ్చి ఏడ్చి నప్పుడు ముఖం చూడకు. సరేనా!"

"…. …."

"నా క్షేమంకోరి నువ్వేమీ చెప్పనక్కర్లేదు చిట్టి తల్లీ! నా బాగోగులు నాకు తెలుసు. ఈ అసూయ వెళ్ళ బోసుకోవటానికేనా, ఇంత ఎండలోపడి వచ్చింది?"

"… …"

"అతన్నిగురించి నువ్వు చెప్పేదేముంటోయ్! నిన్ను గురించి అతనూ చాలా చెప్పాడు. అతనన్నవన్నీ ఇప్పు డంటే, నువ్వు నిలువునా ఫూల్ వవుతావు. కుక్కలాగా అతని వెంటపడ్డది నువ్వా? నేనా?"

"… …."

"అలాగే, వెళ్ళిరా."

"…. …"

"అబ్బెబ్బే! ఇందులో క్షమాపణలు కోరవలసిం దేమీ లేదు. ఓ రకంగా నేనే దురుసుగా మాట్లాడేనేమో ననుకొంటున్నాను. ఎంత స్నేహితురాలివయినా, అతి థివిగదా! అతిథిని అవమానించడం…"

"…. …."

"హమ్మయ్య తుఫాను వెలిసింది. అంతా నాటకం. ఆ గోపాలం నాతో చనువుగా వుంటున్నాడని ఏడుపు. అతన్ని బుట్టలోవేసుకొందామని చాలాకాలంనించీ ప్లాను వేస్తోందిట__"

"…. …."

"ఎవరది? ఏమిటే అమ్మా, అలా వెనగ్గా నిలబడ్డా వేమిటి? ఎంతసేపయిందేమిటి నువ్వొచ్చి?"

"... ...."

"అయితే జానకికి పట్టుకొన్న జబ్బు నీకూ పట్టుకొన్నదన్నమాట! తుఫాను వెలిసిందని ఇప్పుడే అనుకొంటున్నాను. ఏమిటి విశేషాలు?"

"... ...."

"ఎవరా ఉత్తరం రాసింది? ఏమని రాశారేమిటి? నా ఖర్మకాలి, సంతలోని సామానుకన్నా అధ్వాన్నమయిపోతున్నాను. ఎవడో ముక్కూ-ముఖం ఎరగనివాడొస్తాడు, వాడికోసం నన్నోగంగిరెద్దులా అలంకరించి వాడిముందుకు తోల్తారు. ఆ చిట్టితండ్రి నన్ను నిలువునా పరిశీలించి—ఛఛ—ఏమిటే ఈ న్యూసెన్సంతానూ?"

".... ...."

"పెళ్ళి నేనొద్దన్నానా? ఏదున్నా, ఏదిలేకపోయినా ఈ దేశంలో ఆడదానికి పెళ్ళంటూ ఒకటుండితీరాలిగదా! రేపా, ఎల్లుండా అన్నదే సమస్యగానీ, చేసుకోవడం మట్టుకు ఖాయం. నువ్విక నిశ్చింతగా పమిడిపత్తివత్తులు చేసుకోవచ్చు."

".... ..."

"మంచీ-చెడూ లేవని నేను ఛస్తే అనను. సీతాపతి మావయ్య దేవేంద్రుడని నువ్వు అంటావు. నాకో—చపలవాజమ్మగా కనిపిస్తాడు. మొదటిపెళ్ళాన్ని వాతలు పెట్టి చంపినవాణ్ణి ముద్దెట్టుకొని, కాపరం వెలిగించమంటావ్ నువ్వు. అటువంటివాణ్ని గానుగకుకట్టి తిప్పాలంటా న్నేను."

"…. …"

"గోపాలానికీ,మావయ్యకూ పోలికేమిటే అమ్మా! ఇతగాడూ పెళ్ళాన్ని చిత్రహింసలుపెట్టాకగానీ, వారిద్దరికీ పోలికలు కుదరవు.మావయ్య చవట పెద్దమ్మనిఎప్పుడో రుజువయింది."

"…. …"

"జానకితో నే వాగిందంతా, వెనకవుండి వింటివి గదా! మళ్ళీ 'వాణ్నే చేసుకొంటావుటే'అని అడుగుతావేం? చేసుకొంటాననేగా ఆ జానకితో అన్నాను! ఆ మాట అన్నందుకే, ఆవిడ అక్కసంతా వెళ్ళబోసుకుని మరీ వెళ్ళింది. తెలిసిగూడా అడిగితే నేనేమననే అమ్మా?"

"… …"

"గోపాలం ఉత్తకబుర్లపోగా! రాతియుగంమావయ్య మానవోత్తముడా? నాకుమాత్రం వాతలుపెట్టి చంపడనే గ్యారంటీ ఏమిటే అమ్మా? ఇంతకాలం నన్ను పెంచింది, వాతలుపెట్టించుకోమనేనా?"

"… …."

"అక్కడే నువ్వు నాకు అర్థంకాకుండాపోతున్నావమ్మా! మావయ్యను గాకపోతే మరోర్ని చేసుకోమంటున్నావుగదా, నేను గోపాలాన్నే చేసుకొంటే పోయిందేమిటా అని!"

"…. …"

"నీకు జానకిమాటలు నచ్చినంతగా నా మాటలు నచ్చకపోవడం నా ఖర్మం. అందుకే 'పొరుగింటి పుల్ల

కూర రుచి అంటారు. నువ్వు మందిమాటలు వింటావుగానీ, నా మాటలు వినవు."

"... ...."

"మరింకేమే అమ్మా! గోపాలం మనింటికొచ్చినప్పుడు నువ్వూ చూశావుగా! ఎంతసౌమ్యంగా ఉంటాడు! ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూ—"

"... ..."

"అయ్యో ఖర్మం! అతను నన్ను మైదు చేశాడంటావేమిటే! ఒకటికి పదిసార్లు నేను పిలిస్తేగానీ మనింటికి రాలేదు. అనగూడదుగానీ, ఆడదానికన్నా అత నెక్కువ సిగ్గుపడతాడు. అతను నన్ను వల్లో వేసుకోవడంగాదు— జానకి అన్నట్టు—నేనే అతన్ని—"

"... ..."

"ఆఁ. ఇంతకన్నా చెప్పేదేమీలేదు. అన్నీ కలిసొస్తే అతన్నే పెళ్ళాడతాను. కావలసిందల్లా, నీ సత్యాగ్రహం లేకుండా ఉండటం. ఇవ్వాళో రేపో నాన్నతో చెబుదామనుకొంటున్నాను."

"... ..."

"అన్నయ్యొచ్చాడు. ఇప్పుడప్పుడే ఈ గొడవంతా వాడిముందు పడెయ్యకు. వాడసలే తిక్కరాముడు. సమయం చూసి నేనే చెబుతాను!

"ఏమిటి చెప్మా. అన్నయ్య మరీ చిరచిరలాడుతున్నాడు! ఆఫీసులో ఏమన్నా గొడవగానీ జరగలేదు గదా!

"ఏమిత్రా అన్నయ్యా అలా ఉన్నావ్! ఒంట్లో బాగాలేదా ఏం? వదెన్ను పిలవనా? ఇదిగో వదినా, అన్నయ్యొచ్చాడు చూడు. మంచినీళ్ళివ్వనా ఏమిత్రా!"

"... ...."

"అవును. ఇప్పుడే వచ్చివెళ్ళింది. దోవలో నీగ్గాని కనిపించిందా? ఉత్త కుళ్ళుమనిషి. ఎదటివారు సుఖపడు తుంటే దానికళ్ళల్లో నిప్పులోసుకుంటుంది."

"... ....

"అన్నమాట నిజమే! అది మరీ, జనమేజయ ప్రశ్నలన్నీ వేస్తుంటే, గోపాలాన్ని చేసుకోవడం ఖాయమే నన్నాను. ఇదేమంత గొప్ప నేరమని; ఆ జానకి నీదాకా మోసుకొచ్చిందిరా దీన్ని? ఇది చూస్తే తెలియడంలేదూ- దాని కుళ్ళుబోత్తనం!"

"... ..."

"నువ్వు మరీ విడ్డూరంగా మాట్లాడ కన్నయ్యా! గోపాలం రౌడీఏమిత్రా నా తలకాయ! అతన్ని చూస్తే గంగిగోవులా వుంటాడుగదా! రౌడీ అనడానికి నీకు ప్రాణ మెట్లా ఒప్పిందా అని?"

"—— —"

"తీరిగ్గా ఉన్నప్పుడు అలా రైలుస్టేషనుకెళ్ళడం అతనికలవాటుట. అంతమాత్రాన జేబులుకొట్టడాని కెళ్ళిన ట్లేనా? రైలుస్లేషనుకెళ్ళేవారందరూ అందుకోసమే వెడతా రనడం, మంచివాడనవలసినమాట కాదురా అన్నాయ్!"

"... ..."

"నాకు తెలీదు. అతని ఆ స్థిపాస్తుల్నిగురించి నే నెప్పుడూ అడగలేదు. అతనూ చెప్పలేదు. కానీ డబ్బు మాత్రం మంచినీళ్ళలా వాడుతుంటాడు. అదంతా జేబులు కొట్టే సంపాయించాడంటే నేను నమ్మను. నువ్వేగాదు, హరిహరాదులు చెప్పినా నేను నమ్మలేను. అనవసరంగా గోపాలాన్నికించపరిచి,నా మనస్సును నొప్పించకన్నయ్యా."

"...... ......"

"ఇందులో నీమాట వినకపోవడమంటూఏమీ లేదు. మంచిమాట నువ్వు చెప్పాలేగానీ, నేనెందుకు వినను ? నాకేమన్నా పిచ్చా? చపలచిత్తమా వినకపోవడానికి?"

"... ...."

"కుటుంబగౌరవంగురించి నా దగ్గర పాఠాలు వల్లించకు. నువ్వు రోజులకురోజులు, ఆ నీలవేణిఇంట్లో గడిపినప్పుడున్నగౌరవం నేను గోపాలాన్ని చేసుకున్నప్పుడూ వుంటుంది."

"... ..."

"ఏం! ఎత్తినచెయ్యి మళ్ళీ దించేశావేం ? ఉన్నమాటంటే ఉలుకెక్కువంటూ రిందుకేగావును. అనవసరంగా నన్ను కదిలించకు. నేనేమన్నా అంటే నొచ్చుకోవలిసొస్తుంది"

"... ..."

"అది నీ స్వవిషయమయితే, ఇదీ నా స్వవిషయం! ఇందులో నువ్వేమీ జోక్యం కలిగించుకోకు, గోపాలం నీ

బావని చెప్పుకోడానికి నీ కంత నామోషీగా ఉంటే, నేను, నీ చెల్లెల్ని కాదనే చెప్పుకో”

“… …”

“చెప్పు చెప్పు. ఇవ్వాళో రేపో, నేనే నాన్నతో చెబుదామనుకొంటున్నాను. ఎలా బైటపడ్డమా భగవంతుడా అని ఆలోచిస్తున్నాను. నీ ధర్మమా అంటూ, నా సమస్య పరిష్కారమయిపోతుంది. ఈ యింట్లో మందిమాటలు వినడం అందరికీ, ఓ ఫాషనయిపోయింది.”

“… …”

“అదేమిటమ్మా వదినా, నువ్వూ అలా అంటావ్! తోడబుట్టినదాన్ని కొట్టడానికి వాడు చెయ్యెత్తొచ్చుగానీ, నేను గట్టిగా మాట్లాడడం తప్పా ? ఎందుకెందుకని ఊరుకుంటున్నకొద్దీ, అన్నయ్య మరీ శ్రుతిమించిపోతున్నాడు. అసలు వాడికి కాళ్ళు తెచ్చింది నువ్వే వదినా! నీ మంచితనం చూసుకొనే వాడిలా వేటకుక్కలా తయారయ్యాడు.”

“… …”

“భగవంతుడిదయవల్ల, కావాలేగానీ, గోపాలాన్ని అదేదో నాటకంలో ఓ పద్యముండాలి వదినా—ఇక నీ గీచినగీటు దాటనుసుమీ—అలా చేస్తాను చూడు మరీ”

“… …”

“రామాయణమంతా విని, రాముడికి సీత ఏమౌతుం దనా నువ్వడగడం ? అతన్ని పెళ్ళాడబోతున్నాననేగా, అన్నయ్య ఇంతలా భగ్గుమన్నా డిప్పుడు.”

“… …”

నువ్వో శుద్ధ అమాయకురాలి వ్వొదినా. అన్నీ తెలిసిన నువ్వుగూడా ఈ పెళ్ళికి అభ్యంతరం చెబుతున్నావంటే నాకాశ్చర్యంగా ఉంది."

"…. …"

"అవునొదినా! గోపాలం-నిజంగా చాలా అమాయకుడు. ఉత్త పిరికిమనిషికూడా వొదినా! ఓ సినిమాకి రమ్మన్నా; షికారుకి రమ్మన్నా, వల్లమాలిన సిగ్గుపడిపోతాడు. ఎవరన్నా ఏమన్నా అనుకొంటారేమోనని దోవపొడుగంతా గొణుగుతూనే ఉంటాడు. ఒక్కోసారి అతనిమీద కోపమూ, జాలిగూడా వస్తుంది."

"——"

"అయ్యో, పిచ్చివదినా! ఇంట్లోవారందరూ కాదన్నా నేను నా నిర్ణయాన్ని మార్చుకోదలుచుకోలేదు. అటువంటప్పుడు, ఇంతటి అమాయకుడు ఏం నిలబడతాడని నీ ప్రశ్న. కానీ, నా కా నమ్మకముంది వదినా! ఎందుకుందో చెప్పలేను. అయినా, ఈ విషయంగురించి తప్పకుండా ఆలోచిస్తాను."

"——"

"అన్నయ్య గావు కేక లేస్తున్నాడు. త్వరగా వెళ్ళొదినా! ఉరుమురిమి మంగలంమీదపడ్డట్టు నామీదికోపమంతా…."

"హలో… హలో…. రాధను మాట్లాడుతున్నాను. మీ రెవరండీ? గుడ్ ఈవినింగ్ గోపీ… అవునవును, ఏవో గొడవల్లోవుండి, నీ గొంతు గుర్తుపట్టలేకపోయాను… అబ్బే,

వేరేగొడవలేమీ లేవోయ్ గోపీ—మనసంగతే.... ఏముందీ చెప్పడానికి! వడ్లగింజలో బియ్యపుగింజ - నువ్వన్నట్టు, ఈ మనుషులు చాలా గమ్మత్తయినవాళ్ళు గోపీ!.... ఈ ప్రపంచాన్ని ఒకరు చూసినట్టు మరొకరు చూడరు: ఒకరికి కనిపించినట్టు, ఇంకొకరికి కనిపించదు. ఒకొక్కరు ఒకొక్క రంగుకళ్ళజోడు తగిలించుకొని చూస్తారు.... ఏమిటేమిటి— కొంచెం బిగ్గరగా మాట్లాడు — మా అన్నయ్యగారి ధాంధూముల్లో సరిగా వినిపించడంలేదు.(ఫక్కునవ్వుతూ) జరగడానికేముందిలే గోపీ, ఇంతక్రితం జానకి వచ్చింది— నువ్వేదో నమ్మించి ద్రోహంచేసేవాడివంటుంది. మా అమ్మకళ్ళకు, నువ్వు శుద్ధకబుర్లరాయుడివిగా కనిపించావ్. మా అన్నయ్య, నువ్వో దొంగవనీ,రాడీవనీ అంటున్నాడు. చిరంజీవి లక్ష్మీ సౌభాగ్యవతి మా వదినెగారు, నువ్వు పదహారణాల అమాయకుడవంటోంది. మన ప్రిన్స్‌పాల్ గారు, నువ్వు కాలేజీకల్లా తెలివైనవాడివంటారు. పాఠకులు నువ్వు మంచి కథకుడివంటారు ... ఇక నాసంగతి సరేననుకో ...ఇలాగా, ప్రతివారూ తలొక రంగుకళ్ళజోడూ తగిలించుకొని, చూస్తుంటే మనిషి అసలురూపమేమిటో తేలేదెప్పటికీ అని — అలాగే... నేను ఉంటాను గోపీ, వెరీ గుడ్ .... చీరియో."